
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
శుక్రవారం । 27 । జూన్ । 2025



సోమశిలలో 33.690 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో గురువారానికి 33.690 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 204 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,00,320
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.9,065
మూడు శాతం జీఎస్టీతో	రూ.9,337
నవర (8 గ్రాములు)	రూ.74,696

గరిష్ఠం/కనిష్ఠం
36.0 /29.1

వాతావరణం

జిల్లాలో శుక్రవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ 56 శాతంగా గురువారం నమోదైంది.

వాడవాడలా కిండర్

కార్పొరేట్ విద్యాసంస్థల ధనదాహానికి అడ్డూ అదుపు లేకుండా పోతోంది. టెక్నో, ఈ – టెక్నో, ఒలంపియాడ్ పేర్లతో ప్రాథమిక స్థాయి నుంచే అధిక ఫీజులను గుంజుతున్న వీరి కళ్లు తాజాగా కిండర్ గార్డెన్‌పై పడ్డాయి. నిబంధనలను ఉల్లంఘించి వీధివీధినా వీటిని నెలకొల్పి సామాన్యులను పీల్చిపిప్పి చేస్తున్నారు. పోనీ వీటికి అనుమతి ఉందా అంటే అదీ లేదు. జిల్లాలో తొమ్మిదింటికే అనుమతులుండగా, దాదాపు 600 స్కూళ్లను రూల్స్‌కు విరుద్ధంగా నిర్వహిస్తున్నారు. విద్యాశాఖ పరోక్ష సహకారంతో వీరు ఆడిందే ఆట.. పాడిందే పాట అన్న చందంగా పరిస్థితి మారింది.



పుట్టగొడుగుల్లా వెలుస్తున్న స్కూళ్లు

- అనుమతుల్లేకుండానే నర్సరీ, ఎల్కేజీ, యూకేజీ తరగతుల నిర్వహణ
- లక్షల్లో ఫీజుల వసూళ్లు
- ముడుపులు పుచ్చుకొని లైట్ తీసుకుంటున్న అధికారులు
- పేరెంట్స్, విద్యార్థి సంఘాల ఫిర్యాదుతో కదిలిన యంత్రాంగం

ఇదీ తీరు..	జిల్లాలో కిండర్ గార్డెన్ స్కూళ్లు	నగరంలో	అనుమతి పొందినవి
	600కుపైగా..	160కుపైగా	9

నోటీసుల జారీ

జిల్లా వ్యాప్తంగా అనుమతుల్లేకుండా ప్రీ ప్రైమరీ తరగతులను నిర్వహిస్తున్న 600కుపైగా పాఠశాలలకు నోటీసులను జారీ చేశామని జిల్లా విద్యాశాఖ అధికారులు చెప్తున్నారు. నెల్లూరు నగరంలోని 160కుపైగా స్కూళ్ల యాజమాన్యాలకు వీటిని జారీ చేసే పనిలో ఎంఈఓ తిరుపాల్ ఉన్నారు. నెల్లోపు ప్రభుత్వం నుంచి అనుమతులను పొందాలని, లేని పక్షంలో సీజ్ చేస్తామని హెచ్చరిస్తున్నారు. మరోవైపు ప్రభుత్వ పెద్దలకు సంబంధించిన పాఠశాలలు ఉండటంతో నోటీసుల జారీ నత్తనడకన సాగుతోందనే విమర్శలూ లేకపోలేదు. ఈ కోవలో మంత్రి నారాయణ విద్యాసంస్థలు ఎక్కువగా, ఆ తర్వాత శ్రీచైతన్య పాఠశాలలు ఉన్నాయి. దీంతో వీటివైపు అధికారులు కన్నెత్తి చూడటం లేదు.

ఫిర్యాదు చేశాం



ఇప్పటికీ ఏ పాఠశాలకూ నోటీసులను ఇవ్వలేదు. టెక్నో, ఈ – టెక్నో, ఒలంపియాడ్, ఇంటర్నేషనల్ తదితర పేర్లు ఉండకూడదు. వీటిని జతచేసి ఎక్కువ ఫీజులు గుంజుతున్నారు. కలెక్టర్, రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్, నేషనల్ చైల్డ్ ప్రొటెక్షన్.. రాష్ట్ర బాలల హక్కుల సంరక్షణ కమిషన్లకు ఫిర్యాదు చేశాం. వీటిపై చర్యలు చేపట్టాలి.

– నరహరి, పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు

అనుమతులు పొందకపోతే చర్యలు



అనుమతుల్లేకుండా నర్సరీ, ఎల్కేజీ, యూకేజీ తరగతులను నిర్వహిస్తున్న పాఠశాలల యాజమాన్యాలకు నోటీసులను జారీ చేస్తున్నాం. నగరంలో వీటి సంఖ్య 160 ఉన్నట్లు గుర్తించాం. ఆయా మండలాల్లోని ఎంఈఓలు నోటీసులను జారీ చేస్తున్నారు. నెల్లోపు అనుమతులు పొందకపోతే, నిబంధనల మేరకు చర్యలు చేపడతాం

– బాలాజీరావు, డీఈఓ

నెల్లూరు (టౌన్): తమ పిల్లలను ప్రయోజకులుగా తీర్చిదిద్దాలనే తల్లిదండ్రుల ఆశ.. కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలకు కాసుల వర్షాన్ని కురిపిస్తోంది. ప్రాథమిక స్థాయికి విద్యార్థులొచ్చాక ఎటూ ఫీజులొస్తాయి.. ఆలోపే ఎంత కొల్లగొడదామాననే రీతిలో వీరు వ్యవహరిస్తున్నారు. ఫలితంగా జిల్లా వ్యాప్తంగా నర్సరీ (కిండర్ గార్డెన్), ఎల్కేజీ, యూకేజీ పాఠశాలలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. రకరకాల పేర్లు తగిలించి ఫీజులను అమాంతంగా పెంచేస్తున్నారు.

ఆదేశాలతో కదలిక

ప్రధానంగా నారాయణ, శ్రీచైతన్య తదితర విద్యాసంస్థల యాజమాన్యాలు జిల్లా వ్యాప్తంగా బ్రాంచీలను ఏర్పాటు చేసి వీటిని నిర్వహిస్తున్నారు. జిల్లాలోని తొమ్మిదింటికి మినహా మిగిలిన ఎక్కడా వీటి నిర్వహణకు అనుమతుల్లేవు. ఈ తరుణంలో స్కూళ్లలో ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. జిల్లాలో అనుమతుల్లేని కిండర్ గార్డెన్ స్కూళ్లపై రాష్ట్ర పాఠశాల విద్యాశాఖకు పేరెంట్స్ అసోసియేషన్, విద్యార్థి సంఘాల నేతలు ఫిర్యాదు చేశారు. ఈ తరుణంలో అక్కడి నుంచి జారీ అయిన ఆదేశాలతో జిల్లా విద్యాశాఖ అధికారుల్లో కదలికొచ్చింది. దీంతో నోటీసులను జారీ చేస్తున్నారు.

జిల్లాలో ఇబ్బడి ముబ్బడిగా..

జిల్లా వ్యాప్తంగా అనుమతుల్లేకుండా 600కుపైగా నర్సరీ, ఎల్కేజీ, యూకేజీ స్కూళ్లు ఉన్నాయని జిల్లా విద్యాశాఖ అధికారులే చెప్తున్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు అనుమతులు తీసుకున్న కొన్ని యాజమాన్యాలు వీటికి మాత్రం పొందడంలేదు. తరగతుల నిర్వహణకు ఏటా స్కూల్‌ను బట్టి రూ.25 వేల నుంచి రూ.లక్ష వరకు ఫీజుల రూపంలో.. పుస్తకాల పేరిట రూ.ఆరు వేల నుంచి రూ.ఎనిమిది వేల వరకు అదనంగా వసూలు చేస్తున్నారు.

అనుమతులున్నవి వీటికే..

జిల్లా వ్యాప్తంగా నర్సరీ, ఎల్కేజీ, యూకేజీ తరగతుల నిర్వహణకు అనుమతులున్న పాఠశాలల వివరాలను ఇవ్వాలని ఆర్టీఐ కింద సమాచారాన్ని పేరెంట్స్ అసోసియేషన్ కోరింది. దీనిపై జిల్లా విద్యాశాఖ కార్యాలయ ఏడీ లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు. శ్రీచైతన్య (నవలాకుల గార్డెన్స్).. రెయిన్‌బో (మాగుంట లేఅవుట్).. ఆక్స్‌ఫర్డ్.. శ్రీచైతన్య ఎలిమెంటరీ (కందుకూరు).. పోడార్ ఇంటర్నేషనల్ (గంగవరం).. బాలాజీ విద్యామందిర్ (నరుకూరు).. హయగ్రీవ విద్యానికేతన్ (నార్తురాజుపాళెం).. విజ్డమ్ (సంతపేట).. శ్రీచైతన్య (పార్థసారథినగర్)కు మాత్రమే అనుమతి ఉందని తెలిపారు.

అధికారుల కనుసన్నల్లో..

జిల్లా వ్యాప్తంగా నర్సరీ, ఎల్కేజీ, యూకేజీ తరగతుల నిర్వహణ జిల్లా విద్యాశాఖ అధికారుల కనుసన్నల్లో జరుగుతోందని పేరెంట్స్ అసోసియేషన్, విద్యార్థి సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. దీనికి గానూ ఏటా రూ.లక్షల్లో ముడుపులను సమర్పిస్తున్నారనే విమర్శలూ ఉన్నాయి. విద్యా సంవత్సర ప్రారంభానికి ముందే స్కూళ్లను ఎందుకు తనిఖీ చేయడంలేదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మార్గదర్శిగా ఉండాల్సిన మంత్రి నారాయణే ఇలాంటి అడ్డదారులు తొక్కుతుండటంపై పలువురు మండిపడుతున్నారు.

న్యూస్‌రీల్

నిషేధ సమయంలో వేట సాగిస్తే చర్యలు



సోమశిల: సోమశిల జలాశయంలో చేపల వేట నిషేధ సమయంలో నిబంధనలను ఎవరైనా ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని మత్స్యశాఖ ఏడీ శ్రీనివాసులు స్పష్టం చేశారు. స్థానిక మత్స్యకారులు, వ్యాపారులతో కార్యాలయం వద్ద గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలకరి జల్లులు కురిసే సమయంలో జలాశయంలో తల్లి చేపలు గుడ్లతో ఉంటాయని, అప్పుడు వేట సాగిస్తే మత్స్య సంపదను కోల్పోతామన్నారు. జూలై ఒకటి నుంచి ఆగస్టు 31 వరకు వేట నిషేధానికి సహకరించాలని కోరారు. ఎస్డీఓ సురేష్, మత్స్యశాఖ సహాయకురాలు చందన పాల్గొన్నారు.

కాకాణిపై ముగిసిన సిట్ విచారణ

నెల్లూరు (లీగల్): సర్వేపల్లి జలాశయం నుంచి మట్టిని అక్రమంగా తరలించారంటూ నమోదైన కేసులో ఏ – 2గా ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై రెండు రోజుల సిట్ విచారణ గురువారం సాయంత్రంతో ముగిసింది. బాపట్ల నుంచి వచ్చిన సిట్ అధికారులు ఆయన్ను కేంద్ర కారాగారం నుంచి కృష్ణపట్నం పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. అక్కడ ప్రత్యేక గదిలో మధ్యవర్తులు, కాకాణి తరఫు న్యాయవాది విక్రమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో బాపట్ల డీఎస్పీ, సిట్ అధికారి రామాంజనేయులు 20 ప్రశ్నలు అడిగారు. కోర్టు ఇచ్చిన కస్టడీ గడువు ముగియడంతో గోవర్ధన్‌రెడ్డికి వైద్య పరీక్షలు చేయించిన అనంతరం నెల్లూరు రెండో అదనపు మొదటి తరగతి మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చారు. న్యాయమూర్తి శారదారెడ్డి ఉత్తర్వుల మేరకు జిల్లా కేంద్ర కారాగారానికి తరలించారు.

అధ్యాపక ఖాళీలకు దరఖాస్తు చేసుకోండి

ఆత్మకూరు: పట్టణంలోని ఏపీ బాలికల గురుకుల పాఠశాలలో ఎనిమిది అధ్యాపక ఖాళీలకు అర్హులైన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి ప్రిన్సిపల్ రూత్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. తెలుగు పీజీటీ – 1, ఇంగ్లిష్ పీజీటీ – 2, సోషల్ పీజీటీ – 1, టీజీటీ తెలుగు – 1, టీజీటీ లెక్కలు – 1, ఇంగ్లిష్ టీజీటీ – 1, టీజీటీ సోషల్ – 1 ఖాళీలు ఉన్నాయన్నారు. పీజీటీ కోసం 50 శాతం మార్కులు తగ్గకుండా బీఈడీ పూర్తి చేసి ఉండాలని.. టీజీటీకి టెట్ ఉత్తీర్ణతతో బీఈడీ పూర్తి చేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఆత్మకూరులోని గురుకుల బాలికల విద్యాలయంలో ప్రిన్సిపల్‌ను వచ్చే నెల రెండులోపు సంప్రదించాలని సూచించారు. అభ్యర్థుల బోధన పటిమను డిప్యూటీ డీఈఓ ఆధ్వర్యంలో పరిశీలించి ఎంపిక చేయనున్నారని వివరించారు.

భక్తిశ్రద్ధలతో ధ్వజారోహణ



నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని ద్రౌపదీదేవి సమేత కృష్ణ ధర్మరాజస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ధ్వజారోహణను గురువారం జరిపారు. తీర్థవాది, చప్పరోత్సవం తదితర పూజా కార్యక్రమాలను దేవస్థాన ప్రధానార్చకుడు చక్రపాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. భగవద్గీత పఠనం, మహాభారత పురాణ కాలక్షేపం, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. ఉభయకర్తలుగా ఆరంబాకం కృష్ణసింహ సోదరులు వ్యవహరించారు. కాగా పాండవ జనన ఘట్టం తదితర కార్యక్రమాలను శుక్రవారం నిర్వహించనున్నామని ఈఓ జానకి తెలిపారు.

సాగుదారులకు నష్టపరిహారమివ్వాలి

దగదర్తి: దగదర్తి విమానాశ్రయ భూముల్లో ప్రస్తుతం సాగులో ఉన్న లబ్ధిదారులను గుర్తించి వారికి నష్టపరిహారాన్ని అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ డిమాండ్ చేశారు. దామవరంలో విమానాశ్రయానికి కేటాయించిన భూముల్లో గురువారం పర్యటించిన సీపీఎం నేతలకు తమకు జరుగుతున్న అన్యాయాన్ని సాగుదారులు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దామవరంలోని సర్వే నంబర్ 1 / 1 లో సుమారు వందెకరాలను భూమిలేని నిరుపేద రైతులు సాగు చేసుకుంటున్నారని, వీరికి నష్టపరిహారాన్ని చెల్లించాలని కోరారు. అన్యాయం జరిగితే సహించేదిలేదని స్పష్టం చేశారు. నేతలు తుళ్లూరు గోపాల్, మండల నేతలు గోపసాని రమేష్, మాల్యాద్రి, మంద మహేష్, పెరికల మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాదరణను ఓర్వలేకే కేసులు



మాట్లాడుతున్న ఆనం విజయకుమార్‌రెడ్డి

- ఆనం విజయకుమార్‌రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనలకు లభిస్తున్న ప్రజాదరణను ఓర్వలేక అక్రమ కేసులను కూటమి ప్రభుత్వం బనాయిస్తోందని పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్ రెడ్డి ఆరోపించారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో గురువారం ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వ మోసాలను ఏడాది పాలనలోనే ప్రజలు అర్థం చేసుకున్నారని చెప్పారు. వీరికి అండగా ఉంటూ.. భరోసా కలిపిస్తున్న తమ నేతను ఇబ్బంది పెట్టేందుకే కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. రెంటపాళ్ల పర్యటనలో జగన్‌మోహన్‌రెడ్డి కాన్వాయ్ కిందపడి వ్యక్తి మరణించారంటూ తప్పుడు కేసు పెట్టారని విమర్శించారు. ఆ రోజున ఎస్పీ మాటలకు.. ప్రభుత్వం పెట్టిన కేసుకు సంబంధం లేదన్నారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా రూపొందించిన వీడియోను చూపిస్తూ కేసు పెట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. చంద్రబాబు గతంలో సీఎంగా ఉన్న సమయంలో ఎంతో మంది మరణానికి కారణమయ్యారని, ఆయనపై ఎలాంటి కేసును ఎందుకు పెట్టలేదన్నారు. మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై బనాయిస్తున్న అక్రమ కేసుల విషయం ప్రజలందరికీ తెలుసునన్నారు. ఎవరెన్ని ఆంక్షలు పెట్టినా జూలై మూడున జగనన్న పర్యటన నెల్లూరులో ఉంటుందని, ప్రజాభిమానాన్ని ఆపడం ఎవరితరం కాదని స్పష్టం చేశారు.

ఆన్‌లైన్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (టౌన్): ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో ఆన్‌లైన్ ద్వారా జూలై నుంచి ప్రారంభంకానున్న పీజీ, డిగ్రీ, డిగ్రీ హానర్స్, పీజీ డిప్లొమా, డిపామో, సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ తనూజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా వచ్చే నెల 15లోపు స్వీకరించనున్నామని చెప్పారు. వివరాలకు వీఆర్ ఇన్‌స్టిట్యూట్ పీజీ స్టడీ ప్రాంగణంలోని ఇగ్నో స్టడీ సెంటర్ లేదా 0861 – 2301316 నంబర్‌ను సాయంత్రం నాలుగు నుంచి ఆరు గంటల్లోపు సంప్రదించాలని సూచించారు.

నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్‌గా ఆశాలత

నెల్లూరు(అర్బన్): దర్గామిట్టలోని సర్వజన ఆస్పత్రి ఆవరణలో గల ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్‌గా తిరుపతిలో పని చేస్తున్న ఆశాలతను నియమిస్తూ ఉత్తర్వులను ప్రభుత్వం గురువారం జారీ చేసింది. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేస్తున్న వసుంధరను గుంటూరు ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్‌గా బదిలీ చేశారు.

విచారణ పేరిట వేధింపులు

- పోలీస్‌స్టేషన్లో కుప్పకూలిన మహిళ
- టీడీపీ నేతల బ్రోద్బలంతోనేనని భర్త ఆరోపణ



చికిత్స పొందుతున్న శ్రీలక్ష్మి

అనుమసముద్రంపేట: విచారణ పేరిట పోలీసులు వేధించడంతో మహిళ కుప్పకూలిన ఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. మండలంలోని కావలియడవల్లికి చెందిన మానికొండ ఇందిరమ్మ కొన్నేళ్లుగా హైదరాబాద్‌లో నివాసముంటున్నారు. వారం క్రితం తమ సమీప బంధువుల ఇంటికొచ్చారు. గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత శ్రీలక్ష్మి ఇంట్లో ఇందిరమ్మ ఉంటున్నారు. ఈ క్రమంలో తన బంగారం పోయిందంటూ శ్రీలక్ష్మి, వెంకటేశ్వర్లు దంపతులపై పోలీసులకు ఇందిరమ్మ ఆదివారం ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి శ్రీలక్ష్మిని రోజూ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి విచారణ పేరుతో సాయంత్రం వరకు అక్కడే ఉంచారు. ఈ తరుణంలో పోలీస్‌స్టేషన్లో గురువారం ఆమె కుప్పకూలారు. ఆత్మకూరు వైద్యశాలకు తరలించగా, అక్కడ చికిత్స పొందుతున్నారు. కాగా తాము వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనే ఉద్దేశంతో కక్షగట్టి తమను దెబ్బతీసేందుకు కొందరు టీడీపీ నేతలు డ్రామాలాడుతున్నారని భర్త వెంకటేశ్వర్లు ఆరోపించారు. ఇలాంటి రాజకీయాలను మానుకోవాలని, మహిళ అని చూడకుండా పోలీస్‌స్టేషన్ చుట్టూ తిప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

'ఆక్వా' ఎగుమతుల ప్రోత్సాహానికి చర్యలు



మాట్లాడుతున్న ఆనంద్

నెల్లూరు రూరల్: జిల్లాలో ఆక్వా ఉత్పత్తుల ఎగుమతులను ప్రోత్సహించేలా తగు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో గురువారం నిర్వహించిన జిల్లా పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా 973 దరఖాస్తులు రాగా, 856ను ఆమోదించామని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న మిగిలిన వాటిని రానున్న సమావేశంలోపు ఆమోదించాలని సూచించారు. వాణిజ్య పన్నులు, కార్మిక, లీగల్ మెట్రాలజీ తదితర శాఖల వద్ద ఉన్న కేసులను సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయా కంపెనీలకు అవసరమైన మానవ వనరులకు అవసరమైన శిక్షణను ఇప్పించేలా.. సీఎస్సార్ నిధులను వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. పరిశ్రమలకు అవసరమైన భూసేకరణను సత్వరమే పూర్తి చేయాలని చెప్పారు. జిల్లా పరిశ్రమల శాఖ అధికారి మారుతిప్రసాద్, ఏపీఐఐసీ అధికారి శివకుమార్, కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీపూజ తదితరులు పాల్గొన్నారు.

కిసాన్ క్రెడిట్ కార్డులను అందజేయాలి

జిల్లాలో మత్స్యకారులు, పాడి రైతుల జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు గానూ కిసాన్ క్రెడిట్ కార్డులను విరివిగా అందజేయాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో నిర్వహించిన జిల్లా స్థాయి బ్యాంకర్ల సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంకర్లను సమన్వయం చేసుకొని ఐదు వేలకుపైగా కిసాన్ క్రెడిట్ కార్డులను వారంలోపు అందజేయాలని సూచించారు. వ్యవసాయ అనుబంధ రంగాలను ప్రోత్సహించేందుకు రుణాలను అందజేయాలని కోరారు. ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార పరిశ్రమ క్రమబద్ధీకరణ ద్వారా రెడీ టు ఈట్, రెడీ టు కుక్ పరిశ్రమలను ప్రోత్సహించేందుకు బ్యాంకర్లు ముందుకు రావాలన్నారు. అనంతరం వార్షిక రుణ ప్రణాళిక బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. ఎల్డీఎం మణిశేఖర్, నాబార్డు డీడీఎం బాబు, పశుసంవర్ధక, మత్స్యశాఖ జేడీలు రమేష్‌నాయక్, నాగేశ్వరరావు, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు, జిల్లా ఉద్యానాధికారి సుబ్బారెడ్డి, మెప్మా పీడీ లీలారాణి, విద్యుత్ శాఖ ఎస్‌ఈ విజయన్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లాపేరును చెరిపేస్తున్నారు

- నిబంధనలను ఉల్లంఘించి యంత్రాలతో ఇసుక తవ్వకాలు
- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



ట్రాక్టర్‌లో ఇసుకను లోడ్ చేస్తున్న జేసీబీ

ఉదయగిరి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పచ్చ నేతలు చెలరేగిపోతున్నారు. సహజ వనరులను కొల్లగొడుతూ జేబులు నింపుకొంటున్నారు. పిల్లాపేరులోని ఇసుకను రేయింబవళ్లూ ట్రాక్టర్ల ద్వారా తరలిస్తూ ఊడ్చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా జేసీబీలను ఉపయోగించి ఇసుక తవ్వకాలు చేపట్టి రూ.లక్షల్లో ఆర్జిస్తున్నారు. అక్రమ రవాణాను అరికట్టాల్సిన అధికార యంత్రాంగం మామూళ్ల మత్తులో పడి కళ్ల ముందే జరుగుతున్న ఇసుక అక్రమ తరలింపును పట్టించుకోవడం లేదు. దీంతో పిల్లాపేరు పరీవాహక ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటడంతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

భారీగా సాగు

కొండాపురం, వింజమూరు, దుత్తలూరు, వరికుంటపాడు, ఉదయగిరి, సీతారామపురం మండలాల పరిధిలో పిల్లాపేరు సుమారు 50 కిలోమీటర్ల మేర ప్రవహిస్తుంది. వర్షాకాలంలో నీటి ప్రవాహంతో ఇసుక మేట పడుతుంది. దీంతో భూగర్భ జలాలు పెరిగి సమీప ప్రాంతాల్లోని రైతులు వివిధ పంటలను సాగు చేస్తారు. అయితే ఏడాది కాలంగా పచ్చ నేతలు ఇక్కడ నిత్యం యంత్రాలను ఉపయోగించి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు.

ట్రాక్టర్ల ద్వారా కొల్లగొడుతూ..

ఉదయగిరి, వింజమూరు, దుత్తలూరు, పామూరు ప్రాంతాలకు పిల్లాపేరు నుంచి నిత్యం పెద్ద సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నారు. దూరం బట్టి ఒక్కో ట్రాక్టర్‌కు రూ.1500 నుంచి రూ.3500 వరకు బాడుగ వసూలు చేస్తున్నారు. మరోవైపు పేదలు తమ ఇళ్ల నిర్మాణం కోసం ట్రాక్టర్లు, ఎడ్ల బండ్లు, ఆటోలను ఉపయోగించి కూలీల ద్వారా ఇసుకను లోడ్ చేయించి అవసరాలను తీర్చుకోవచ్చనే జీఓను ప్రభుత్వం జారీ చేసింది. అయితే అధికార పార్టీ నేతలు తమ ట్రాక్టర్లను ఉపయోగించి ఇసుకను రవాణా చేస్తూ అధిక ధరలకు విక్రయిస్తున్నారు.

గత ప్రభుత్వంలో ఇలా..

గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో ఇసుక అవసరమైతే సచివాలయం వద్ద తమ వివరాలను నమోదు చేసుకొని పర్మిట్ పొంది రవాణా చేసుకునే అవకాశం ఉండేది. దీంతో అక్రమ రవాణాకు అవకాశం లేదు. అయితే ఇప్పుడా విధానాన్ని తొలగించడంతో రాజకీయ పలుకుబడి ఉన్నవారికే ఇసుక వెళ్తోంది. పేదలు అధిక ధరలను చెల్లించాల్సి వస్తోంది. ఇసుక ఉచితమని పేరుకు చెప్తున్నా, ఎక్కడా అది అమలుకు నోచుకోవడంలేదు.

డ్రగ్స్ వాడకంతో అనర్థాలు



ప్రదర్శనను ప్రారంభిస్తున్న సుజాత

నెల్లూరు(అర్బన్): మాదకద్రవ్యాలను వినియోగిస్తే అనర్థాలు సంభవిస్తాయని డీఎంహెచ్‌ఓ సుజాత పేర్కొన్నారు. ప్రపంచ యాంటీ డ్రగ్ డేను పురస్కరించుకొని దర్గామిట్టలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల, సర్వజన ఆస్పత్రి ఆవరణలో పలువురు వైద్య సిబ్బంది, డాక్టర్లతో ప్రదర్శనను నవజీవన్ ఐడీయూ ఎన్జీఓ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. దీన్ని ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడారు. టీవీలు, సినిమాలు, సోషల్ మీడియా మాయాజాలంలో పడి యువత ఎక్కువగా డ్రగ్స్ బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీటి వినియోగానికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఏడీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ తదితరులు పాల్గొన్నారు.

ఎంఐజీకి మోక్షమెప్పుడో..?

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎంఐజీ లేఅవుట్ల ఏర్పాటు
- కందుకూరులో 25.30 ఎకరాల్లో అభివృద్ధికి ప్రణాళిక
- అప్పట్లోనే 32 మంది ప్లాట్ల కొనుగోలు
- కూటమి ప్రభుత్వంలో నిలిచిన పనులు
- ఎమ్మెల్యే మాట నీటిమూటే..


ప్రస్తుతం లేఅవుట్ పరిస్థితి

కందుకూరు: పట్టణ ప్రాంతాల్లోని మధ్య తరగతి ప్రజలకు తక్కువ ధరలో సొంత స్థలం అందించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఎంఐజీ (మిడిల్ ఇన్‌కమ్ గ్రూప్) లేఅవుట్ల విధానానికి శ్రీకారం చుట్టింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే దానికి గ్రహణం పట్టింది. సకల సౌకర్యాలతో అందుబాటు ధరలో ప్లాట్‌లు దక్కించుకునే అవకాశాన్ని మధ్య తరగతి ప్రజలకు ఈ సర్కారు దూరం చేస్తోంది. కందుకూరులోని ఎంఐజీ లేఅవుట్ ప్రస్తుత పరిస్థితే ఇందుకు నిదర్శనం. ఏడాది కాలంగా దీని పనులు ఆగిపోయాయి. దీంతో ప్లాట్ల కొనుగోలు కోసం అడ్వాన్స్‌లు చెల్లించిన వారి పరిస్థితి అయోమయంగా మారింది.

25.30 ఎకరాల్లో..

జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్ పేరుతో గత ప్రభుత్వం ఎంఐజీ లేఅవుట్ల విధానాన్ని ప్రారంభించింది. కందుకూరు పట్టణంలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ వద్ద ఉన్న ప్రభుత్వ స్థలాన్ని గుర్తించింది. దాదాపు 25.30 ఎకరాల్లో లేఅవుట్ అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. అన్ని అనుమతులు ప్రభుత్వమే కల్పించడంతోపాటు, లేఅవుట్లో మౌలిక వసతులు కల్పించే బాధ్యత తీసుకుంది. వసతులు కల్పించిన తర్వాత ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం మధ్య తరగతి ప్రజలకు ప్లాట్లు విక్రయిస్తారు. కందుకూరులో లేఅవుట్‌లో 292 ప్లాట్లు వచ్చేలా రూపకల్పన చేశారు. ఒక్కొక్కటి 192 చదరపు గజాల నుంచి 240 చదరపు గజాలు ఉండేలా రూపొందించారు. గజం ధర రూ.6,999గా నిర్ణయించారు. ఈ ధరలోనే లేవుట్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, అంతర్గత రోడ్లు, మంచినీటి ట్యాప్ కనెక్షన్, విద్యుత్ సౌకర్యం వంటి మౌలిక వసతులను ప్రభుత్వమే ఏర్పాటు చేస్తుంది. నాడు దాదాపు 50 శాతం వరకు పనులు పూర్తి చేసింది. లేఅవుట్‌ను పూర్తిగా లెవలింగ్ చేయడంతోపాటు, విద్యుత్ స్తంభాల ఏర్పాటు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం, మంచినీటి సరఫరా కోసం ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణం వంటి పనులు చేపట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. లేఅవుట్ అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. డ్రైనేజీల నిర్మాణానికి తెచ్చిన మెటీరియల్, ఇతర సామగ్రి పూర్తిగా నిరుపయోగంగా మారింది. అలాగే ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది. దీంతో ఈ లేఅవుట్ అభివృద్ధి ఎప్పుడు పూర్తవుతుంతో.. అసలు చేస్తారో.. చేయరో.. అర్థం కాని పరిస్థితి నెలకొంది.

లబోదిబోమంటున్న లబ్ధిదారులు

లేఅవుట్‌లో ఒక్కో ప్లాట్ ధర సైజును బట్టి రూ.14 లక్షల నుంచి రూ.16.50 లక్షల వరకు ఉంది. ముందుగా బుక్‌చేసుకోవాలంటే అడ్వాన్స్‌గా ప్లాట్ ధరలో 10 శాతం చెల్లించాలి. 31 మంది లబ్ధిదారులు ముందుగానే ప్లాట్‌లు కొనుగోలు చేసి మున్సిపాలిటీకి తమ వాటా డబ్బులు కూడా చెల్లించారు. ఆ తర్వాత లేఅవుట్ అభివృద్ధి చేసే దాన్ని బట్టి విడతల వారీగా మిగిలిన మొత్తాన్ని చెల్లించాలి. కానీ అడ్వాన్స్ చెల్లించిన లబ్ధిదారుల పరిస్థితి నేడు అయోమయంగా మారింది. క్యాన్సిల్ చేసుకుని తాము చెల్లించిన డబ్బులు తిరిగి ఇవ్వమంటే సమాధానం చెప్పేవారు కరువయ్యారు. దీంతో మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరగడం తప్ప ప్రస్తుతం వీరు ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. మిగిలిన ప్లాట్ల కొనుగోలు చేసేందుకు ఎవరూ ముందుకు వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఎంఐజీ లేవుట్‌ను అభివృద్ధి చేస్తామని, రేట్లు కూడా తగ్గిస్తామంటూ ఆరు నెలల క్రితం ప్రకటించారు. కానీ ఇంత వరకు దాని గురించి పట్టించుకున్న పాపాన పోలేదు.

కండలేరులో 34.210 టీఎంసీలు



రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 34.210 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సత్యసాయి గంగ కాలువకు 2,260, పిన్నేరు కాలువకు 10, లోలెవల్ కాలువకు 70, హైలెవల్ కాలువకు 20, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

వచ్చే నెల 3న 16 రోజుల పండగ


వెంగమాంబ దేవస్థానం

దుత్తలూరు: మండలంలోని నర్రవాడలో ఉన్న వెంగమాంబ పేరంటాలు 16 రోజుల పండగ జూలై 3వ తేదీన జరుగుతుందని ఆలయ ఈఓ ఉషశ్రీ గురువారం తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా వెంగమాంబ – గురవయ్య దంపతుల కల్యాణోత్సవం జరిగిన రోజు నుంచి 16వ రోజు ఈ పండగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉన్నందున తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.

విద్యుత్ స్టార్టర్, కేబుల్ చోరీ

చిట్టమూరు: మండలంలోని తాడిమేడు గ్రామ పొలాల్లో ఉన్న విద్యుత్ స్టార్టర్లు, కేబుల్‌ను దుండగులు చోరీ చేశారు. స్థానికుల కథనం మేరకు.. అనగొల్లపాళెం గ్రామానికి చెందిన కట్టబోయిన పరంధామయ్య ఎడగారులో బోరు నీటి ఆధారంగా వరి పంట సాగు చేశాడు. బుధవారం సాయంత్రం వరకు పొలం వద్ద ఉన్నాడు. గురువారం ఉదయం అక్కడికి వెళ్లి చూసి మోటార్ స్టార్టర్, కేబుల్ చోరీకి గురైనట్టు గుర్తించాడు. అదేవిధంగా ఆరూరు, తాడిమేడు, తంబుగారిపాళెం గ్రామాలకు చెందిన రైతుల పొలాల్లోని స్టార్టర్లు, కేబుల్ వైర్లు చోరీకి గురవుతున్నట్టు బాధితులు వాపోతున్నారు. పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.25
సన్నవి : రూ.20
పండ్లు : రూ.8

కారులో మంటలు

- తప్పిన ప్రమాదం


కాలిపోయిన కారు

మనుబోలు: కారులో హఠాత్తుగా మంటలు చెలరేగాయి. వాహనం నడుపుతున్న వ్యక్తి వెంటనే స్పందించి కిందకు దిగేయడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటన మండల పరిధిలోని హైవేపై కాగితాలపూరు క్రాస్ రోడ్డు సమీపంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. నెల్లూరుకు చెందిన హితేష్ కుమార్ తన సంతానాన్ని తీసుకుని కారులో గూడూరుకు బయలుదేరాడు. నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో చేర్పించి తిరిగి నెల్లూరుకు బయలుదేరాడు. కాగితాలపూరు క్రాస్‌రోడ్డు సమీపంలో ఉన్నట్లుండి కారులోంచి పొగలు రాసాగాయి. దీంతో హితేష్ వెంటనే కారును రోడ్డు పక్కన ఆపగా కుటుంబ సభ్యులంతా దిగేశారు. చూస్తుండగానే మంటలు ఎక్కువయ్యాయి. ఐజేఎం హైవే మొబైల్ సిబ్బంది మినీ అగ్నిమాపక వాహనాన్ని రప్పించి మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే కారు చాలావరకూ కాలిపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

ఉత్తర్వులు అమలు చేయాలని వినతి


వినతిపత్రం ఇస్తున్న సుధాకర్‌రావు తదితరులు

నెల్లూరు(అర్బన్): రాష్ట్రంలో వైద్యశాఖలో పనిచేస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ పోస్టుల హోదాను ఇటీవల డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్లుగా పేరు మారుస్తూ ప్రభుత్వ జారీ చేసిన జీఓ నంబర్ 64ను తక్షణమే అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఏపీ రాష్ట్ర డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్స్ అసోసియేషన్ అమరావతి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటరమణ, చేజర్ల సుధాకర్‌రావు కోరారు. ఈమేరకు గురువారం సచివాలయంలో కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నెల్లూరు నుంచి పాల్గొన్న సుధాకర్‌రావు మాట్లాడుతూ తమ విజ్ఞప్తి మేరకు ఈనెల 3వ తేదీన హెల్త్ ఎడ్యుకేటర్‌ను ఆఫీసర్‌గా పేరు మారుస్తూ జీఓ విడుదల చేసిన కుటుంబ సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబుకు, అందుకు సహకరించిన కుటుంబ ఆరోగ్య సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అయితే ఆ ఆదేశాలను రాష్ట్ర ఆరోగ్య శాఖ రీజినల్ డైరెక్టర్లకు, వైద్య సంబంధిత అధికారులకు, జిల్లా వైద్య శాఖ అధికారులకు సర్క్యులేట్ చేసి తక్షణమే అమలు జరిపించాలని కోరారు. వచ్చే నెల 1 నుంచి అటెండర్స్ రిజిస్టర్‌లో హెల్త్ ఎడ్యుకేటర్ స్థానంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్‌గా నమోదు చేయించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కోశాధికారి హరిప్రసాద్ పాల్గొన్నారు.

3న ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జూలై 3వ తేదీన ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఫుట్‌బాల్ జట్టు ఎంపికలు జరుగుతాయని నెల్లూరు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి బి.చంద్రశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ సీనియర్ పురుషుల అంతర్ జిల్లాల చాంపియన్‌షిప్ 2025 – 26న జూలైలో జరుగుతుందన్నారు. ఈ ప్రతిష్టాత్మక పోటీల్లో పాల్గొనేందుకు ఎంపికలు జరుగుతాయని, ఆసక్తి గల క్రీడాకారులు వారి జనన ధ్రువీకరణపత్రం, ఆధార్‌కార్డు, పాసుపోర్టు సైజు ఫొటోలను తీసుకుని హాజరుకావాలని కోరారు. ఇతర వివరాలకు 99498 53555, 94407 42002 ఫోన్ నంబర్లను సంప్రదించాలని తెలియజేశారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన లారీ


ఘటనా స్థలంలో ట్రాక్టర్

వెంకటాచలం: మండల కేంద్రమైన వెంకటాచలంలో జాతీయ రహదారిపై పొట్టు లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తాపడింది. ఈ ఘటన గురువారం ఉదయం జరిగింది. నెల్లూరు వైపు నుంచి గూడూరు వైపు వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో అదుపుతప్పి బోల్తా పడింది. పొట్టు జాతీయ రహదారిపై పడడంతో ట్రాఫిక్ స్తంభించింది. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో బోల్తా

- ముగ్గురికి గాయాలు


ఘటనా స్థలంలో ఆటో, కూలీలు

సైదాపురం: మండలంలోని కలిచేడు గ్రామ సమీపంలో గురువారం ఆటో బోల్తా పడి ముగ్గురు గని కార్మికులు గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని అనంతమడుగు గ్రామానికి చెందిన రామయ్య తన ఆటోలో పలువురు కార్మికులను ఎక్కించుకుని పొదలకూరు కొనగలూరు గ్రామంలో ఉన్న గని వద్దకు తీసుకెళ్తుంటాడు. తిరిగి ఇంటికి చేరుస్తుంటాడు. గురువారం ఉదయం 15 మంది కార్మికులతో అనంతమడుగు నుంచి కొనగలూరుకు బయలుదేరాడు. కలిచేడు సమీపంలోని మసీదు దగ్గర ఉన్న కల్వర్టు వద్ద ఆటో బోల్తా పడింది. దీంతో బుల్లెమ్మ, రమణయ్య, వెంకటేశ్వర్లు గాయపడ్డారు. వారిని పొదలకూరు ఆస్పత్రికి తరలించారు. మిగిలిన వారికి గాయాలు కాలేదు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థినికి రాష్ట్ర స్థాయి ర్యాంకు


నాగరాణి

ఉదయగిరి రూరల్: రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో ప్రవేశం పొందేందుకు నిర్వహించిన ఏపీ పీజీ సెట్ 2025లో పట్టణంలోని మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని బి.నాగరాణి కళాశాల టాపర్‌గానే కాక ఫిజిక్స్ సబ్జెక్ట్‌లో రాష్ట్ర స్థాయిలో మూడవ ర్యాంక్ సాధించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ ఎల్.నారాయణస్వామి తెలిపారు. గురువారం ప్రిన్సిపల్‌తోపాటు వైస్ ప్రిన్సిపల్ ఎ.నరసింహులు, ఐక్యూ ఏసీ కో- ఆర్డినేటర్ విక్రమ్, అధ్యాపకులు వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావులు విద్యార్థినిని అభినందనలు తెలిపారు.

టమాటా లోడు వాహనం బోల్తా



వెంకటగిరి రూరల్: పెంచలకోన – ఏర్పేడు జాతీయ రహదారిలోని కలపాడు వద్ద గురువారం టమాటా లోడుతో వెళుతున్న వాహనం అదుపు తప్పి బోల్తాపడింది. స్థానికుల కథనం మేరకు.. మినీ ట్రక్కు టమాటాలు తీసుకుని వెంకటగిరి నుంచి దక్కిలి బయలుదేరింది. కలపాడు వద్ద వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో వాహనంలో ఉన్న వారికి స్వల్పగాయాలయ్యాయి. టమాటాలు కిందపడ్డాయి. ఎన్‌హెచ్ పెట్రోలింగ్ సిబ్బంది అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. స్థానికులు టమాటాల కోసం ఎగబడ్డారు.

యువకుడి ఆత్మహత్య

కావలి(జలదంకి): కావలి – వెంకటేశ్వరపాళెం రైల్వేస్టేషన్ల మధ్య దిగువ లైన్‌లో రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం జరిగింది. రైల్వే పోలీసుల కథనం మేరకు.. పొన్నాడి శ్రావణ్ కుమార్ (24) అనే యువకుడు కావలి మండలంలోని ఒట్టూరు గ్రామంలో ఉంటున్నాడు. శ్రావణ్, అతని తండ్రి అప్పులపాలయ్యారు. ఈ క్రమంలో శ్రావణ్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న కావలి జీఆర్పీ ఎస్సై రమాదేవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తెలుగు గంగ ఇంజినీర్‌పై చర్యలకు డిమాండ్


మాట్లాడుతున్న శ్యామ్‌సుందర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: తప్పుడు కుల ధ్రువీకరణ పత్రాలతో ఉద్యోగం సంపాదించి పదోన్నతి పొంది తిరుపతిలో తెలుగు గంగ సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న తలమంచి గంగాధర్‌రావుపై చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త కోటారెడ్డి శ్యామ్‌సుందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం నెల్లూరులోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గంగాధర్‌రావు ప్రభుత్వాన్ని మోసం చేసి 1989లో ఉద్యోగం పొందారన్నారు. టీడీపీ ప్రభుత్వాన్ని అడ్డం పెట్టుకుని అన్ని పనులు చక్కబెట్టుకుంటున్నారన్నారు. దొంగ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు, ప్రమోషన్లు పొందడం న్యాయమా అని నిలదీశారు. ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పెళ్లి ఆపాలంటూ యువకుడి రచ్చ

- నలుగు కార్యక్రమంలో హల్‌చల్

నెల్లూరు సిటీ: ఓ యువతి పెళ్లిని యువకుడు ఆపేశాడు. పెళ్లికొడుకు, బంధువుల సమక్షంలో నలుగు కార్యక్రమం జరుగుతుండగా.. తన స్నేహితులతో వెళ్లి 'ఈ పెళ్లి ఆపండి, యువతితో నేను పదేళ్లుగా ప్రేమలో ఉన్నా' అన్నాడు. అంతటితో ఆగకుండా అక్కడే ఉన్న సారె పళ్లాన్ని కాలితో తన్నాడు. ఈ దృశ్యాన్ని చూసిన ప్రతి ఒక్కరూ షాక్‌కు గురయ్యారు. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరుకు చెందిన ఓ యువతి తన పెద్దమ్మ ఇంటికి తరచూ వెళ్లేది. 2022లో అక్కడ నందవర్ధన్ అనే యువకుడితో పరిచయం ఏర్పడింది. ఈ విషయం యువతి తల్లిదండ్రులకు తెలిసింది. ఆ యువకుడు మంచివాడు కాదు, మాట్లాడొద్దని కుటుంబ సభ్యులు హెచ్చరించడంతో ఆమె మాట్లాడటం మానేసింది. అయితే నందవర్ధన్ మారలేదు. మాట్లాడకపోతే తన వద్ద ఉన్న ఫొటోలు అందరికీ చూపిస్తానని బెదిరించడం ప్రారంభించాడు. యువతి కుటుంబం సంబంధాలు చూస్తుండగా, వాటిని కూడా చెడగొట్టేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో యువతి కుటుంబ సభ్యులు సైతం నందవర్ధన్ కుటుంబంతో మాట్లాడి ఒకరి జోలికి ఒకరు వెళ్లకూడదని అంగీకారం చెప్పుకొన్నారు. కొన్నిరోజుల తర్వాత తిరిగి నందవర్ధన్ మాత్రం యువతి వెనుకపడటం ప్రారంభించాడు. ఫొటోలను అందరికీ చూపిస్తానని బెదిరించాడు. దీంతో యువతి కుటుంబ సభ్యులు నవాబుపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నందవర్ధన్‌ను పోలీసులు స్టేషన్‌కు పిలిపించి మందలించారు.

పోలీసులకు ఫిర్యాదు

యువతికి సంబంధం చూసి వివాహం చేసేందుకు పెద్దలు నిర్ణయించారు. ఈ క్రమంలో ఈ నెల 22వ తేదీన అయ్యప్ప గుడి సెంటర్‌లోని రాధాకృష్ణ కల్యాణ మండపంలో బంధువుల సమక్షంలో నలుగు కార్యక్రమం జరిగింది. అక్కడికి పెళ్లికొడుకు కూడా వచ్చాడు. ఈ విషయం తెలుసుకున్న నందవర్ధన్ తన స్నేహితులు కుమార్, తులసీతో కలిసి వెళ్లి యువతిని కాలితో కొట్టే క్రమంలో సారె పళ్లాన్ని తన్నాడు. కొంతసేపు ఉద్రిక్తత వాతావరణం చోటు చేసుకోవడంతో అక్కడున్న వారంతా భయపడ్డారు. దీంతో యువతి కుటుంబ సభ్యులు వేదాయపాళెం పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. వారు గురువారం కేసు నమోదు చేశారు.

వ్యక్తి బలవన్మరణం

విడవలూరు: ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని బుసగాడిపాళెం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని బుసగాడిపాళెం గ్రామానికి చెందిన ఇండ్ల శామ్యూల్ (22)కు భార్య చెంచులక్ష్మి, ఇద్దరు పిల్లలున్నారు. బుధవారం అతను ఇంట్లో ఉండగా తల్లి ఇంటి పనులు పూర్తిచేయించాలని మందలించింది. దీంతో మనస్తాపం చెంది పొలాల్లో చల్లే గుళికల మందు తిని ఇంట్లో ఉండగా గమనించిన కుటుంబ సభ్యులు ఆయన్ను నెల్లూరు ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతిచెందాడు. ఈ ఘటనపై ఆయన భార్య స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘాల ఏర్పాటు


సీఈఓకు సర్టిఫికెట్ అందజేస్తున్న డీసీఓ గుర్రప్ప

- డీసీఓ గుర్రప్ప


నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని డీసీసీ బ్యాంక్ పరిధిలో 19 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ద్వారా రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేస్తున్నట్లు డీసీఓ గుర్రప్ప తెలిపారు. నెల్లూరులోని కృషి విజ్ఞాన కేంద్రంలో గురువారం పీఏసీఎస్ సంఘాల సీఈఓలకు రైతు ఉత్పత్తిదారుల సంఘాల ఏర్పాటు, నిర్వహణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ సాంకేతికత, పరపతి, ఇన్‌పుట్, రైతులు పండించిన పంటలకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు దేశ వ్యాప్తంగా 10 వేల సంఘాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. వ్యవసాయ శాఖ, పశుసంవర్ధక శాఖ, ఉద్యాన శాఖల సహకారంతో రైతులకు డ్రోన్‌లు, విత్తన ఉత్పత్తి, పాలిహౌస్, గ్రీన్‌హౌస్ శక్తిటిల్లర్, స్ప్రేయర్లు లాంటి పరికరాలు అందిండం జరుగుతుందన్నారు. అనంతరం సీఈఓలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఆప్కాబ్ ఏజీఎం ప్రదీప్‌రెడ్డి, డీసీసీబీ జీఎం సరిత, కృషి విజ్ఞాన కేంద్ర సమన్వయకర్త డా.శివజ్యోతి, మనీషా, గురూజీ తదితరులు పాల్గొన్నారు.



సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం, 27, జూన్, 2025



సోమశిలలో 33.690 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో గురువారానికి 33.690 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 204 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,00,320
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.9,065
మూడు శాతం జీఎస్టీతో	రూ.9,337
నవర (8 గ్రాములు)	రూ.74,696

వాతావరణం

గరిష్టం/కనిష్టం 36.0 /29.1

జిల్లాలో శుక్రవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ 56 శాతంగా గురువారం నమోదైంది.

న్యూస్‌రీల్

నిషేధ సమయంలో వేట సాగిస్తే చర్యలు



సోమశిల: సోమశిల జలాశయంలో చేపల వేట నిషేధ సమయంలో నిబంధనలను ఎవరైనా ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని మత్స్యశాఖ ఏడీ శ్రీనివాసులు స్పష్టం చేశారు. స్థానిక మత్స్యకారులు, వ్యాపారులతో కార్యాలయం వద్ద గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలకరి జల్లులు కురిసే సమయంలో జలాశయంలో తల్లి చేపలు గుడ్లతో ఉంటాయని, అప్పుడు వేట సాగిస్తే మత్స్య సంపదను కోల్పోతామన్నారు. జూలై ఒకటి నుంచి ఆగస్టు 31 వరకు వేట నిషేధానికి సహకరించాలని కోరారు. ఎస్డీఓ సురేష్, మత్స్యశాఖ సహాయకురాలు చందన పాల్గొన్నారు.

కాకాణిపై ముగిసిన సిట్ విచారణ

నెల్లూరు (లీగల్): సర్వేపల్లి జలాశయం నుంచి మట్టిని అక్రమంగా తరలించారంటూ నమోదైన కేసులో ఏ – 2గా ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై రెండు రోజుల సిట్ విచారణ గురువారం సాయంత్రంతో ముగిసింది. బాపట్ల నుంచి వచ్చిన సిట్ అధికారులు ఆయన్ను కేంద్ర కారాగారం నుంచి కృష్ణపట్నం పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. అక్కడ ప్రత్యేక గదిలో మధ్యవర్తులు, కాకాణి తరఫు న్యాయవాది విక్రమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో బాపట్ల డీఎస్పీ, సిట్ అధికారి రామాంజనేయులు 20 ప్రశ్నలు అడిగారు. కోర్టు ఇచ్చిన కస్టడీ గడువు ముగియడంతో గోవర్ధన్‌రెడ్డికి వైద్య పరీక్షలు చేయించిన అనంతరం నెల్లూరు రెండో అదనపు మొదటి తరగతి మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చారు. న్యాయమూర్తి శారదారెడ్డి ఉత్తర్వుల మేరకు జిల్లా కేంద్ర కారాగారానికి తరలించారు.

అధ్యాపక ఖాళీలకు దరఖాస్తు చేసుకోండి

ఆత్మకూరు: పట్టణంలోని ఏపీ బాలికల గురుకుల పాఠశాలలో ఎనిమిది అధ్యాపక ఖాళీలకు అర్హులైన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి ప్రిన్సిపల్ రూత్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. తెలుగు పీజీటీ – 1, ఇంగ్లిష్ పీజీటీ – 2, సోషల్ పీజీటీ – 1, టీజీటీ తెలుగు – 1, టీజీటీ లెక్కలు – 1, ఇంగ్లిష్ టీజీటీ – 1, టీజీటీ సోషల్ – 1 ఖాళీలు ఉన్నాయన్నారు. పీజీటీ కోసం 50 శాతం మార్కులు తగ్గకుండా బీఈడీ పూర్తి చేసి ఉండాలని.. టీజీటీకి టెట్ ఉత్తీర్ణతతో బీఈడీ పూర్తి చేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఆత్మకూరులోని గురుకుల బాలికల విద్యాలయంలో ప్రిన్సిపల్‌ను వచ్చే నెల రెండులోపు సంప్రదించాలని సూచించారు. అభ్యర్థుల బోధన పటిమను డిప్యూటీ డీఈఓ ఆధ్వర్యంలో పరిశీలించి ఎంపిక చేయనున్నారని వివరించారు.

భక్తిశ్రద్ధలతో ధ్వజారోహణ



నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని ద్రౌపదీదేవి సమేత కృష్ణ ధర్మరాజస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ధ్వజారోహణను గురువారం జరిపారు. తీర్థవాది, చప్పరోత్సవం తదితర పూజా కార్యక్రమాలను దేవస్థాన ప్రధానార్చకుడు చక్రపాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. భగవద్గీత పఠనం, మహాభారత పురాణ కాలక్షేపం, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. ఉభయకర్తలుగా ఆరంబాకం కృష్ణసింహ సోదరులు వ్యవహరించారు. కాగా పాండవ జనన ఘట్టం తదితర కార్యక్రమాలను శుక్రవారం నిర్వహించనున్నామని ఈఓ జానకి తెలిపారు.

సాగుదారులకు నష్టపరిహారమివ్వాలి

దగదర్తి: దగదర్తి విమానాశ్రయ భూముల్లో ప్రస్తుతం సాగులో ఉన్న లబ్ధిదారులను గుర్తించి వారికి నష్టపరిహారాన్ని అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ డిమాండ్ చేశారు. దామవరంలో విమానాశ్రయానికి కేటాయించిన భూముల్లో గురువారం పర్యటించిన సీపీఎం నేతలకు తమకు జరుగుతున్న అన్యాయాన్ని సాగుదారులు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దామవరంలోని సర్వే నంబర్ 1 / 1 లో సుమారు వందెకరాలను భూమిలేని నిరుపేద రైతులు సాగు చేసుకుంటున్నారని, వీరికి నష్టపరిహారాన్ని చెల్లించాలని కోరారు. అన్యాయం జరిగితే సహించేదిలేదని స్పష్టం చేశారు. నేతలు తుళ్లూరు గోపాల్, మండల నేతలు గోపసాని రమేష్, మాల్యాద్రి, మంద మహేష్, పెరికల మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా కిండర్

కార్పొరేట్ విద్యాసంస్థల ధనదాహానికి అడ్డూ అదుపు లేకుండా పోతోంది. టెక్నో, ఈ – టెక్నో, ఒలంపియాడ్ పేర్లతో ప్రాథమిక స్థాయి నుంచే అధిక ఫీజులను గుంజుతున్న వీరి కళ్లు తాజాగా కిండర్ గార్డెన్‌పై పడ్డాయి. నిబంధనలను ఉల్లంఘించి వీధివీధినా వీటిని నెలకొల్పి సామాన్యులను పీల్చి పిప్పి చేస్తున్నారు. పోనీ వీటికి అనుమతి ఉందా అంటే అదీ లేదు. జిల్లాలో తొమ్మిదింటికే అనుమతులుండగా, దాదాపు 600 స్కూళ్లను రూల్స్‌కు విరుద్ధంగా నిర్వహిస్తున్నారు. విద్యాశాఖ పరోక్ష సహకారంతో వీరు ఆడిందే ఆట.. పాడిందే పాట అన్న చందంగా పరిస్థితి మారింది.



పుట్టగొడుగుల్లా వెలుస్తున్న స్కూళ్లు

- అనుమతుల్లేకుండానే నర్సరీ, ఎల్కేజీ, యూకేజీ తరగతుల నిర్వహణ
- లక్షల్లో ఫీజుల వసూళ్లు
- ముడుపులు పుచ్చుకొని లైట్ తీసుకుంటున్న అధికారులు
- పేరెంట్స్, విద్యార్థి సంఘాల ఫిర్యాదుతో కదిలిన యంత్రాంగం

ఇదీ తీరు..

జిల్లాలో కిండర్ గార్డెన్ స్కూళ్లు	నగరంలో	అనుమతి పొందినవి
600కుపైగా..	160కుపైగా	9

నెల్లూరు (టౌన్): తమ పిల్లలను ప్రయోజకులుగా తీర్చిదిద్దాలనే తల్లిదండ్రుల ఆశ.. కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలకు కాసుల వర్షాన్ని కురిపిస్తోంది. ప్రాథమిక స్థాయికి విద్యార్థులొచ్చాక ఎటూ ఫీజులొస్తాయి.. ఆలోపే ఎంత కొల్లగొడదామననే రీతిలో వీరు వ్యవహరిస్తున్నారు. ఫలితంగా జిల్లా వ్యాప్తంగా నర్సరీ (కిండర్ గార్డెన్), ఎల్కేజీ, యూకేజీ పాఠశాలలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. రకరకాల పేర్లు తగిలించి ఫీజులను అమాంతంగా పెంచేస్తున్నారు.

ఆదేశాలతో కదలిక

ప్రధానంగా నారాయణ, శ్రీచైతన్య తదితర విద్యాసంస్థల యాజమాన్యాలు జిల్లా వ్యాప్తంగా బ్రాంచీలను ఏర్పాటు చేసి వీటిని నిర్వహిస్తున్నారు. జిల్లాలోని తొమ్మిదింటికి మినహా మిగిలిన ఎక్కడా వీటి నిర్వహణకు అనుమతుల్లేవు. ఈ తరుణంలో స్కూళ్లలో ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. జిల్లాలో అనుమతుల్లేని కిండర్ గార్డెన్ స్కూళ్లపై రాష్ట్ర పాఠశాల విద్యాశాఖకు పేరెంట్స్ అసోసియేషన్, విద్యార్థి సంఘాల నేతలు ఫిర్యాదు చేశారు. ఈ తరుణంలో అక్కడి నుంచి జారీ అయిన ఆదేశాలతో జిల్లా విద్యాశాఖ అధికారుల్లో కదలికొచ్చింది. దీంతో నోటీసులను జారీ చేస్తున్నారు.

నోటీసుల జారీ

జిల్లా వ్యాప్తంగా అనుమతుల్లేకుండా ప్రీ ప్రైమరీ తరగతులను నిర్వహిస్తున్న 600కుపైగా పాఠశాలలకు నోటీసులను జారీ చేశామని జిల్లా విద్యాశాఖ అధికారులు చెప్తున్నారు. నెల్లూరు నగరంలోని 160కుపైగా స్కూళ్ల యాజమాన్యాలకు వీటిని జారీ చేసే పనిలో ఎంఈఓ తిరుపాల్ ఉన్నారు. నెల్లోపు ప్రభుత్వం నుంచి అనుమతులను పొందాలని, లేని పక్షంలో సీజ్ చేస్తామని హెచ్చరిస్తున్నారు. మరోవైపు ప్రభుత్వ పెద్దలకు సంబంధించిన పాఠశాలలు ఉండటంతో నోటీసుల జారీ నత్తనడకన సాగుతోందనే విమర్శలూ లేకపోలేదు. ఈ కోవలో మంత్రి నారాయణ విద్యాసంస్థలు ఎక్కువగా, ఆ తర్వాత శ్రీచైతన్య పాఠశాలలు ఉన్నాయి. దీంతో వీటివైపు అధికారులు కన్నెత్తి చూడటం లేదు.

అనుమతులున్నవి వీటికే..

జిల్లా వ్యాప్తంగా నర్సరీ, ఎల్కేజీ, యూకేజీ తరగతుల నిర్వహణకు అనుమతులున్న పాఠశాలల వివరాలను ఇవ్వాలని ఆర్టీఐ కింద సమాచారాన్ని పేరెంట్స్ అసోసియేషన్ కోరింది. దీనిపై జిల్లా విద్యాశాఖ కార్యాలయ ఏడీ లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు. శ్రీచైతన్య (నవలాకుల గార్డెన్స్).. రెయిన్‌బో (మాగుంట లేఅవుట్).. ఆక్స్‌ఫర్డ్.. శ్రీచైతన్య ఎలిమెంటరీ (కందుకూరు).. పోడార్ ఇంటర్నేషనల్ (గంగవరం).. బాలాజీ విద్యామందిర్ (నరుకూరు).. హయగ్రీవ విద్యానికేతన్ (నార్తురాజుపాళెం).. విజ్డమ్ (సంతపేట).. శ్రీచైతన్య (పార్థసారథినగర్)కు మాత్రమే అనుమతి ఉందని తెలిపారు.

జిల్లాలో ఇబ్బడి ముబ్బడిగా..

జిల్లా వ్యాప్తంగా అనుమతుల్లేకుండా 600కుపైగా నర్సరీ, ఎల్కేజీ, యూకేజీ స్కూళ్లు ఉన్నాయని జిల్లా విద్యాశాఖ అధికారులే చెప్తున్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు అనుమతులు తీసుకున్న కొన్ని యాజమాన్యాలు వీటికి మాత్రం పొందడంలేదు. తరగతుల నిర్వహణకు ఏటా స్కూల్‌ను బట్టి రూ.25 వేల నుంచి రూ.లక్ష వరకు ఫీజుల రూపంలో.. పుస్తకాల పేరిట రూ.ఆరు వేల నుంచి రూ.ఎనిమిది వేల వరకు అదనంగా వసూలు చేస్తున్నారు.

అధికారుల కనుసన్నల్లో..

జిల్లా వ్యాప్తంగా నర్సరీ, ఎల్కేజీ, యూకేజీ తరగతుల నిర్వహణ జిల్లా విద్యాశాఖ అధికారుల కనుసన్నల్లో జరుగుతోందని పేరెంట్స్ అసోసియేషన్, విద్యార్థి సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. దీనికి గానూ ఏటా రూ.లక్షల్లో ముడుపులను సమర్పిస్తున్నారనే విమర్శలూ ఉన్నాయి. విద్యా సంవత్సర ప్రారంభానికి ముందే స్కూళ్లను ఎందుకు తనిఖీ చేయడంలేదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మార్గదర్శిగా ఉండాల్సిన మంత్రి నారాయణే ఇలాంటి అడ్డదారులు తొక్కుతుండటంపై పలువురు మండిపడుతున్నారు.

ఫిర్యాదు చేశాం



ఇప్పటికీ ఏ పాఠశాలకూ నోటీసులను ఇవ్వలేదు. టెక్నో, ఈ – టెక్నో, ఒలంపియాడ్, ఇంటర్నేషనల్ తదితర పేర్లు ఉండకూడదు. వీటిని జతచేసి ఎక్కువ ఫీజులు గుంజుతున్నారు. కలెక్టర్, రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్, నేషనల్ చైల్డ్ ప్రొటెక్షన్.. రాష్ట్ర బాలల హక్కుల సంరక్షణ కమిషన్లకు ఫిర్యాదు చేశాం. వీటిపై చర్యలు చేపట్టాలి.

– నరహరి, పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు

అనుమతులు పొందకపోతే చర్యలు



అనుమతుల్లేకుండా నర్సరీ, ఎల్కేజీ, యూకేజీ తరగతులను నిర్వహిస్తున్న పాఠశాలల యాజమాన్యాలకు నోటీసులను జారీ చేస్తున్నాం. నగరంలో వీటి సంఖ్య 160 ఉన్నట్లు గుర్తించాం. ఆయా మండలాల్లోని ఎంఈఓలు నోటీసులను జారీ చేస్తున్నారు. నెల్లోపు అనుమతులు పొందకపోతే, నిబంధనల మేరకు చర్యలు చేపడతాం

– బాలాజీరావు, డీఈఓ

ప్రజాదరణను ఓర్వలేకే కేసులు



మాట్లాడుతున్న ఆనం విజయకుమార్‌రెడ్డి

- ఆనం విజయకుమార్‌రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనలకు లభిస్తున్న ప్రజాదరణను ఓర్వలేక అక్రమ కేసులను కూటమి ప్రభుత్వం బనాయిస్తోందని పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్ రెడ్డి ఆరోపించారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో గురువారం ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వ మోసాలను ఏడాది పాలనలోనే ప్రజలు అర్థం చేసుకున్నారని చెప్పారు. వీరికి అండగా ఉంటూ.. భరోసా కల్పిస్తున్న తమ నేతను ఇబ్బంది పెట్టేందుకే కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. రెంటపాళ్ల పర్యటనలో జగన్‌మోహన్‌రెడ్డి కాన్వాయ్ కిందపడి వ్యక్తి మరణించారంటూ తప్పుడు కేసు పెట్టారని విమర్శించారు. ఆ రోజున ఎస్పీ మాటలకు.. ప్రభుత్వం పెట్టిన కేసుకు సంబంధం లేదన్నారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా రూపొందించిన వీడియోను చూపిస్తూ కేసు పెట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. చంద్రబాబు గతంలో సీఎంగా ఉన్న సమయంలో ఎంతో మంది మరణానికి కారణమయ్యారని, ఆయనపై ఎలాంటి కేసును ఎందుకు పెట్టలేదన్నారు. మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై బనాయిస్తున్న అక్రమ కేసుల విషయం ప్రజలందరికీ తెలుసునన్నారు. ఎవరెన్ని ఆంక్షలు పెట్టినా జూలై మూడున జగనన్న పర్యటన నెల్లూరులో ఉంటుందని, ప్రజాభిమానాన్ని ఆపడం ఎవరితరం కాదని స్పష్టం చేశారు.

ఆన్‌లైన్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (టౌన్): ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో ఆన్‌లైన్ ద్వారా జూలై నుంచి ప్రారంభంకానున్న పీజీ, డిగ్రీ, డిగ్రీ హానర్స్, పీజీ డిప్లొమా, డిప్లొమో, సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ తనూజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా వచ్చే నెల 15లోపు స్వీకరించనున్నామని చెప్పారు. వివరాలకు వీఆర్ ఇన్‌స్టిట్యూట్ పీజీ స్టడీ ప్రాంగణంలోని ఇగ్నో స్టడీ సెంటర్ లేదా 0861 – 2301316 నంబర్‌ను సాయంత్రం నాలుగు నుంచి ఆరు గంటల్లోపు సంప్రదించాలని సూచించారు.

నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్‌గా ఆశాలత

నెల్లూరు(అర్బన్): దర్గామిట్టలోని సర్వజన ఆస్పత్రి ఆవరణలో గల ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్‌గా తిరుపతిలో పని చేస్తున్న ఆశాలతను నియమిస్తూ ఉత్తర్వులను ప్రభుత్వం గురువారం జారీ చేసింది. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేస్తున్న వసుంధరను గుంటూరు ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్‌గా బదిలీ చేశారు.

విచారణ పేరిట వేధింపులు

- పోలీస్‌స్టేషన్లో కుప్పకూలిన మహిళ
- టీడీపీ నేతల ప్రోద్బలంతోనేనని భర్త ఆరోపణ



చికిత్స పొందుతున్న శ్రీలక్ష్మి

అనుమసముద్రంపేట: విచారణ పేరిట పోలీసులు వేధించడంతో మహిళ కుప్పకూలిన ఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. మండలంలోని కావలియడవల్లికి చెందిన మానికొండ ఇందిరమ్మ కొన్నేళ్లుగా హైదరాబాద్‌లో నివాసముంటున్నారు. వారం క్రితం తమ సమీప బంధువుల ఇంటికొచ్చారు. గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత శ్రీలక్ష్మి ఇంట్లో ఇందిరమ్మ ఉంటున్నారు. ఈ క్రమంలో తన బంగారం పోయిందంటూ శ్రీలక్ష్మి, వెంకటేశ్వర్లు దంపతులపై పోలీసులకు ఇందిరమ్మ ఆదివారం ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి శ్రీలక్ష్మిని రోజూ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి విచారణ పేరుతో సాయంత్రం వరకు అక్కడే ఉంచారు. ఈ తరుణంలో పోలీస్‌స్టేషన్లో గురువారం ఆమె కుప్పకూలారు. ఆత్మకూరు వైద్యశాలకు తరలించగా, అక్కడ చికిత్స పొందుతున్నారు. కాగా తాము వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనే ఉద్దేశంతో కక్షగట్టి తమను దెబ్బతీసేందుకు కొందరు టీడీపీ నేతలు డ్రామాలాడుతున్నారని భర్త వెంకటేశ్వర్లు ఆరోపించారు. ఇలాంటి రాజకీయాలను మానుకోవాలని, మహిళ అని చూడకుండా పోలీస్‌స్టేషన్ చుట్టూ తిప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

'ఆక్వా' ఎగుమతుల ప్రోత్సాహానికి చర్యలు



మాట్లాడుతున్న ఆనంద్

నెల్లూరు రూరల్: జిల్లాలో ఆక్వా ఉత్పత్తుల ఎగుమతులను ప్రోత్సహించేలా తగు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో గురువారం నిర్వహించిన జిల్లా పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా 973 దరఖాస్తులు రాగా, 856ను ఆమోదించామని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న మిగిలిన వాటిని రానున్న సమావేశంలోపు ఆమోదించాలని సూచించారు. వాణిజ్య పన్నులు, కార్మిక, లీగల్ మెట్రాలజీ తదితర శాఖల వద్ద ఉన్న కేసులను సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయా కంపెనీలకు అవసరమైన మానవ వనరులకు అవసరమైన శిక్షణను ఇప్పించేలా.. సీఎస్సార్ నిధులను వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. పరిశ్రమలకు అవసరమైన భూసేకరణను సత్వరమే పూర్తి చేయాలని చెప్పారు. జిల్లా పరిశ్రమల శాఖ అధికారి మారుతిప్రసాద్, ఏపీఐఐసీ అధికారి శివకుమార్, కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీపూజ తదితరులు పాల్గొన్నారు.

కిసాన్ క్రెడిట్ కార్డులను అందజేయాలి

జిల్లాలో మత్స్యకారులు, పాడి రైతుల జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు గానూ కిసాన్ క్రెడిట్ కార్డులను విరివిగా అందజేయాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో నిర్వహించిన జిల్లా స్థాయి బ్యాంకర్ల సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంకర్లను సమన్వయం చేసుకొని ఐదు వేలకుపైగా కిసాన్ క్రెడిట్ కార్డులను వారంలోపు అందజేయాలని సూచించారు. వ్యవసాయ అనుబంధ రంగాలను ప్రోత్సహించేందుకు రుణాలను అందజేయాలని కోరారు. ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార పరిశ్రమ క్రమబద్ధీకరణ ద్వారా రెడీ టు ఈట్, రెడీ టు కుక్ పరిశ్రమలను ప్రోత్సహించేందుకు బ్యాంకర్లు ముందుకు రావాలన్నారు. అనంతరం వార్షిక రుణ ప్రణాళిక బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. ఎల్డీఎం మణిశేఖర్, నాబార్డు డీడీఎం బాబు, పశుసంవర్ధక, మత్స్యశాఖ జేడీలు రమేష్‌నాయక్, నాగేశ్వరరావు, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు, జిల్లా ఉద్యానాధికారి సుబ్బారెడ్డి, మెప్మా పీడీ లీలారాణి, విద్యుత్ శాఖ ఎస్‌ఈ విజయన్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లాపేరును చెరిపేస్తున్నారు

- నిబంధనలను ఉల్లంఘించి యంత్రాలతో ఇసుక తవ్వకాలు
- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



ట్రాక్టర్‌లో ఇసుకను లోడ్ చేస్తున్న జేసీబీ

ఉదయగిరి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పచ్చ నేతలు చెలరేగిపోతున్నారు. సహజ వనరులను కొల్లగొడుతూ జేబులు నింపుకొంటున్నారు. పిల్లాపేరులోని ఇసుకను రేయింబవళ్లూ ట్రాక్టర్ల ద్వారా తరలిస్తూ ఊడ్చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా జేసీబీలను ఉపయోగించి ఇసుక తవ్వకాలు చేపట్టి రూ.లక్షల్లో ఆర్జిస్తున్నారు. అక్రమ రవాణాను అరికట్టాల్సిన అధికార యంత్రాంగం మామూళ్ల మత్తులో పడి కళ్ల ముందే జరుగుతున్న ఇసుక అక్రమ తరలింపును పట్టించుకోవడం లేదు. దీంతో పిల్లాపేరు పరీవాహక ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటడంతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

భారీగా సాగు

కొండాపురం, వింజమూరు, దుత్తలూరు, వరికుంటపాడు, ఉదయగిరి, సీతారామపురం మండలాల పరిధిలో పిల్లాపేరు సుమారు 50 కిలోమీటర్ల మేర ప్రవహిస్తుంది. వర్షాకాలంలో నీటి ప్రవాహంతో ఇసుక మేట పడుతుంది. దీంతో భూగర్భ జలాలు పెరిగి సమీప ప్రాంతాల్లోని రైతులు వివిధ పంటలను సాగు చేస్తారు. అయితే ఏడాది కాలంగా పచ్చ నేతలు ఇక్కడ నిత్యం యంత్రాలను ఉపయోగించి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు.

ట్రాక్టర్ల ద్వారా కొల్లగొడుతూ..

ఉదయగిరి, వింజమూరు, దుత్తలూరు, పామూరు ప్రాంతాలకు పిల్లాపేరు నుంచి నిత్యం పెద్ద సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నారు. దూరం బట్టి ఒక్కో ట్రాక్టర్‌కు రూ.1500 నుంచి రూ.3500 వరకు బాడుగ వసూలు చేస్తున్నారు. మరోవైపు పేదలు తమ ఇళ్ల నిర్మాణం కోసం ట్రాక్టర్లు, ఎడ్ల బండ్లు, ఆటోలను ఉపయోగించి కూలీల ద్వారా ఇసుకను లోడ్ చేయించి అవసరాలను తీర్చుకోవచ్చనే జీఓను ప్రభుత్వం జారీ చేసింది. అయితే అధికార పార్టీ నేతలు తమ ట్రాక్టర్లను ఉపయోగించి ఇసుకను రవాణా చేస్తూ అధిక ధరలకు విక్రయిస్తున్నారు.

గత ప్రభుత్వంలో ఇలా..

గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో ఇసుక అవసరమైతే సచివాలయం వద్ద తమ వివరాలను నమోదు చేసుకొని పర్మిట్ పొంది రవాణా చేసుకునే అవకాశం ఉండేది. దీంతో అక్రమ రవాణాకు అవకాశం లేదు. అయితే ఇప్పుడా విధానాన్ని తొలగించడంతో రాజకీయ పలుకుబడి ఉన్నవారికే ఇసుక వెళ్తోంది. పేదలు అధిక ధరలను చెల్లించాల్సి వస్తోంది. ఇసుక ఉచితమని పేరుకు చెప్తున్నా, ఎక్కడా అది అమలుకు నోచుకోవడంలేదు.

డ్రగ్స్ వాడకంతో అనర్థాలు



ప్రదర్శనను ప్రారంభిస్తున్న సుజాత

నెల్లూరు(అర్బన్): మాదకద్రవ్యాలను వినియోగిస్తే అనర్థాలు సంభవిస్తాయని డీఎంహెచ్‌ఓ సుజాత పేర్కొన్నారు. ప్రపంచ యాంటీ డ్రగ్ డేను పురస్కరించుకొని దర్గామిట్టలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల, సర్వజన ఆస్పత్రి ఆవరణలో పలువురు వైద్య సిబ్బంది, డాక్టర్లతో ప్రదర్శనను నవజీవన్ ఐడీయూ ఎన్జీఓ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. దీన్ని ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడారు. టీవీలు, సినిమాలు, సోషల్ మీడియా మాయాజాలంలో పడి యువత ఎక్కువగా డ్రగ్స్ బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీటి వినియోగానికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఏడీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో 34.210 టీఎంసీలు



రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 34.210 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సత్యసాయి గంగ కాలువకు 2,260, పిన్నేరు కాలువకు 10, లోలెవల్ కాలువకు 70, హైలెవల్ కాలువకు 20, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

ఎంఐజీకి మోక్షమెప్పుడో..?

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎంఐజీ లేఅవుట్ల ఏర్పాటు
- కందుకూరులో 25.30 ఎకరాల్లో అభివృద్ధికి ప్రణాళిక
- అప్పట్లోనే 32 మంది ప్లాట్ల కొనుగోలు
- కూటమి ప్రభుత్వంలో నిలిచిన పనులు
- ఎమ్మెల్యే మాట నీటిమూటే..

కందుకూరు: పట్టణ ప్రాంతాల్లోని మధ్య తరగతి ప్రజలకు తక్కువ ధరలో సొంత స్థలం అందించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఎంఐజీ (మిడిల్ ఇన్‌కమ్ గ్రూప్) లేఅవుట్ల విధానానికి శ్రీకారం చుట్టింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే దానికి గ్రహణం పట్టింది. సకల సౌకర్యాలతో అందుబాటు ధరలో ప్లాట్‌లు దక్కించుకునే అవకాశాన్ని మధ్య తరగతి ప్రజలకు ఈ సర్కారు దూరం చేస్తోంది. కందుకూరులోని ఎంఐజీ లేఅవుట్ ప్రస్తుత పరిస్థితే ఇందుకు నిదర్శనం. ఏడాది కాలంగా దీని పనులు ఆగిపోయాయి. దీంతో ప్లాట్ల కొనుగోలు కోసం అడ్వాన్స్‌లు చెల్లించిన వారి పరిస్థితి అయోమయంగా మారింది.

25.30 ఎకరాల్లో..

జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్ పేరుతో గత ప్రభుత్వం ఎంఐజీ లేఅవుట్ల విధానాన్ని ప్రారంభించింది. కందుకూరు పట్టణంలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ వద్ద ఉన్న ప్రభుత్వ స్థలాన్ని గుర్తించింది. దాదాపు 25.30 ఎకరాల్లో లేఅవుట్ అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. అన్ని అనుమతులు ప్రభుత్వమే కల్పించడంతోపాటు, లేఅవుట్లో మౌలిక వసతులు కల్పించే బాధ్యత తీసుకుంది. వసతులు కల్పించిన తర్వాత ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం మధ్య తరగతి ప్రజలకు ప్లాట్లు విక్రయిస్తారు. కందుకూరులో లేఅవుట్‌లో 292 ప్లాట్లు వచ్చేలా రూపకల్పన చేశారు. ఒక్కొక్కటి 192 చదరపు గజాల నుంచి 240 చదరపు గజాలు ఉండేలా రూపొందించారు. గజం ధర రూ.6,999గా నిర్ణయించారు. ఈ ధరలోనే లేవుట్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, అంతర్గత రోడ్లు, మంచినీటి ట్యాప్ కనెక్షన్, విద్యుత్ సౌకర్యం వంటి మౌలిక వసతులను ప్రభుత్వమే ఏర్పాటు చేస్తుంది. నాడు దాదాపు 50 శాతం వరకు పనులు పూర్తి చేసింది. లేఅవుట్‌ను పూర్తిగా లెవలింగ్ చేయడంతోపాటు, విద్యుత్ స్తంభాల ఏర్పాటు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం, మంచినీటి సరఫరా కోసం ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణం వంటి పనులు చేపట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. లేఅవుట్ అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. డ్రైనేజీల నిర్మాణానికి తెచ్చిన మెటీరియల్, ఇతర సామగ్రి పూర్తిగా నిరుపయోగంగా మారింది. అలాగే ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది. దీంతో ఈ లేఅవుట్ అభివృద్ధి ఎప్పుడు పూర్తవుతుంతో.. అసలు చేస్తారో.. చేయరో.. అర్థం కాని పరిస్థితి నెలకొంది.



ప్రస్తుతం లేఅవుట్ పరిస్థితి

లబోదిబోమంటున్న లబ్ధిదారులు

లేఅవుట్‌లో ఒక్కో ప్లాట్ ధర సైజును బట్టి రూ.14 లక్షల నుంచి రూ.16.50 లక్షల వరకు ఉంది. ముందుగా బుక్‌చేసుకోవాలంటే అడ్వాన్స్‌గా ప్లాట్ ధరలో 10 శాతం చెల్లించాలి. 31 మంది లబ్ధిదారులు ముందుగానే ప్లాట్‌లు కొనుగోలు చేసి మున్సిపాలిటీకి తమ వాటా డబ్బులు కూడా చెల్లించారు. ఆ తర్వాత లేఅవుట్ అభివృద్ధి చేసే దాన్ని బట్టి విడతల వారీగా మిగిలిన మొత్తాన్ని చెల్లించాలి. కానీ అడ్వాన్స్ చెల్లించిన లబ్ధిదారుల పరిస్థితి నేడు అయోమయంగా మారింది. క్యాన్సిల్ చేసుకుని తాము చెల్లించిన డబ్బులు తిరిగి ఇవ్వమంటే సమాధానం చెప్పేవారు కరువయ్యారు. దీంతో మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరగడం తప్ప ప్రస్తుతం వీరు ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. మిగిలిన ప్లాట్ల కొనుగోలు చేసేందుకు ఎవరూ ముందుకు వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఎంఐజీ లేవుట్‌ను అభివృద్ధి చేస్తామని, రేట్లు కూడా తగ్గిస్తామంటూ ఆరు నెలల క్రితం ప్రకటించారు. కానీ ఇంత వరకు దాని గురించి పట్టించుకున్న పాపాన పోలేదు.

వచ్చే నెల 3న 16 రోజుల పండగ



వెంగమాంబ దేవస్థానం

దుత్తలూరు: మండలంలోని నర్రవాడలో ఉన్న వెంగమాంబ పేరంటాలు 16 రోజుల పండగ జూలై 3వ తేదీన జరుగుతుందని ఆలయ ఈఓ ఉషశ్రీ గురువారం తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా వెంగమాంబ – గురవయ్య దంపతుల కల్యాణోత్సవం జరిగిన రోజు నుంచి 16వ రోజు ఈ పండగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉన్నందున తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.

విద్యుత్ స్టార్టర్, కేబుల్ చోరీ

చిట్టమూరు: మండలంలోని తాడిమేడు గ్రామ పొలాల్లో ఉన్న విద్యుత్ స్టార్టర్లు, కేబుల్‌ను దుండగులు చోరీ చేశారు. స్థానికుల కథనం మేరకు.. అనగొల్లపాళెం గ్రామానికి చెందిన కట్టబోయిన పరంధామయ్య ఎడగారులో బోరు నీటి ఆధారంగా వరి పంట సాగు చేశాడు. బుధవారం సాయంత్రం వరకు పొలం వద్ద ఉన్నాడు. గురువారం ఉదయం అక్కడికి వెళ్లి చూసి మోటార్ స్టార్టర్, కేబుల్ చోరీకి గురైనట్టు గుర్తించాడు. అదేవిధంగా ఆరూరు, తాడిమేడు, తంబుగారిపాళెం గ్రామాలకు చెందిన రైతుల పొలాల్లోని స్టార్టర్లు, కేబుల్ వైర్లు చోరీకి గురవుతున్నట్లు బాధితులు వాపోతున్నారు. పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.25
సన్నవి : రూ.20
పండ్లు : రూ.8

కారులో మంటలు

- తప్పిన ప్రమాదం

మనుబోలు: కారులో హఠాత్తుగా మంటలు చెలరేగాయి. వాహనం నడుపుతున్న వ్యక్తి వెంటనే స్పందించి కిందకు దిగేయడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటన మండల పరిధిలోని హైవేపై కాగితాలపూరు క్రాస్ రోడ్డు సమీపంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. నెల్లూరుకు చెందిన హితేష్ కుమార్ తన సంతానాన్ని తీసుకుని కారులో గూడూరుకు బయలుదేరాడు. నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో చేర్పించి తిరిగి నెల్లూరుకు బయలుదేరాడు. కాగితాలపూరు క్రాస్‌రోడ్డు సమీపంలో ఉన్నట్లుండి కారులోంచి పొగలు రాసాగాయి. దీంతో హితేష్ వెంటనే కారును రోడ్డు పక్కన ఆపగా కుటుంబ సభ్యులంతా దిగేశారు. చూస్తుండగానే మంటలు ఎక్కువయ్యాయి. ఐజేఎం హైవే మొబైల్ సిబ్బంది మినీ అగ్నిమాపక వాహనాన్ని రప్పించి మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే కారు చాలావరకూ కాలిపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.



కాలిపోయిన కారు

ఉత్తర్వులు అమలు చేయాలని వినతి

నెల్లూరు(అర్బన్): రాష్ట్రంలో వైద్యశాఖలో పనిచేస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ పోస్టుల హోదాను ఇటీవల డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్లుగా పేరు మారుస్తూ ప్రభుత్వ జారీ చేసిన జీఓ నంబర్ 64ను తక్షణమే అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఏపీ రాష్ట్ర డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్స్ అసోసియేషన్ అమరావతి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటరమణ, చేజర్ల సుధాకర్‌రావు కోరారు. ఈమేరకు గురువారం సచివాలయంలో కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నెల్లూరు నుంచి పాల్గొన్న సుధాకర్‌రావు మాట్లాడుతూ తమ విజ్ఞప్తి మేరకు ఈనెల 3వ తేదీన హెల్త్ ఎడ్యుకేటర్‌ను ఆఫీసర్‌గా పేరు మారుస్తూ జీఓ విడుదల చేసిన కుటుంబ సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబుకు, అందుకు సహకరించిన కుటుంబ ఆరోగ్య సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అయితే ఆ ఆదేశాలను రాష్ట్ర ఆరోగ్య శాఖ రీజినల్ డైరెక్టర్లకు, వైద్య సంబంధిత అధికారులకు, జిల్లా వైద్య శాఖ అధికారులకు సర్క్యులేట్ చేసి తక్షణమే అమలు జరిపించాలని కోరారు. వచ్చే నెల 1 నుంచి అటెండర్స్ రిజిస్టర్‌లో హెల్త్ ఎడ్యుకేటర్ స్థానంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్‌గా నమోదు చేయించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కోశాధికారి హరిప్రసాద్ పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న సుధాకర్‌రావు తదితరులు

3న ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జూలై 3వ తేదీన ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఫుట్‌బాల్ జట్టు ఎంపికలు జరుగుతాయని నెల్లూరు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి బి.చంద్రశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ సీనియర్ పురుషుల అంతర్ జిల్లాల చాంపియన్‌షిప్ 2025 – 26న జూలైలో జరుగుతుందన్నారు. ఈ ప్రతిష్టాత్మక పోటీల్లో పాల్గొనేందుకు ఎంపికలు జరుగుతాయని, ఆసక్తి గల క్రీడాకారులు వారి జనన ధ్రువీకరణపత్రం, ఆధార్‌కార్డు, పాసుపోర్టు సైజు ఫొటోలను తీసుకుని హాజరుకావాలని కోరారు. ఇతర వివరాలకు 99498 53555, 94407 42002 ఫోన్ నంబర్లను సంప్రదించాలని తెలియజేశారు.



టమాటా లోడు వాహనం బోల్తా



వెంకటగిరి రూరల్: పెంచలకోన – ఏర్పేడు జాతీయ రహదారిలోని కలపాడు వద్ద గురువారం టమాటా లోడుతో వెళుతున్న వాహనం అదుపు తప్పి బోల్తాపడింది. స్థానికుల కథనం మేరకు.. మినీ ట్రక్కు టమాటాలు తీసుకుని వెంకటగిరి నుంచి డక్కిలి బయలుదేరింది. కలపాడు వద్ద వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో వాహనంలో ఉన్న వారికి స్వల్పగాయాలయ్యాయి. టమాటాలు కిందపడ్డాయి. ఎస్‌హెచ్ పెట్రోలింగ్ సిబ్బంది అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. స్థానికులు టమాటాల కోసం ఎగబడ్డారు.

యువకుడి ఆత్మహత్య

కావలి(జలదంకి): కావలి – వెంకటేశ్వరపాళెం రైల్వేస్టేషన్ల మధ్య దిగువ లైన్‌లో రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం జరిగింది. రైల్వే పోలీసుల కథనం మేరకు.. పొన్నాడి శ్రావణ్ కుమార్ (24) అనే యువకుడు కావలి మండలంలోని ఒట్టూరు గ్రామంలో ఉంటున్నాడు. శ్రావణ్, అతని తండ్రి అప్పులపాలయ్యారు. ఈ క్రమంలో శ్రావణ్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న కావలి జీఆర్పీ ఎస్సై రమాదేవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తెలుగు గంగ ఇంజినీర్‌పై చర్యలకు డిమాండ్



మాట్లాడుతున్న శ్యామ్‌సుందర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: తప్పుడు కుల ధ్రువీకరణ పత్రాలతో ఉద్యోగం సంపాదించి పదోన్నతి పొంది తిరుపతిలో తెలుగు గంగ సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న తలమంచి గంగాధర్‌రావుపై చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త కోటారెడ్డి శ్యామ్‌సుందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం నెల్లూరులోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గంగాధర్‌రావు ప్రభుత్వాన్ని మోసం చేసి 1989లో ఉద్యోగం పొందారన్నారు. టీడీపీ ప్రభుత్వాన్ని అడ్డం పెట్టుకుని అన్ని పనులు చక్కబెట్టుకుంటున్నారన్నారు. దొంగ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు, ప్రమోషన్లు పొందడం న్యాయమా అని నిలదీశారు. ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పెళ్లి ఆపాలంటూ యువకుడి రచ్చ

- నలుగు కార్యక్రమంలో హల్‌చల్

నెల్లూరు సిటీ: ఓ యువతి పెళ్లిని యువకుడు ఆపేశాడు. పెళ్లికొడుకు, బంధువుల సమక్షంలో నలుగు కార్యక్రమం జరుగుతుండగా.. తన స్నేహితులతో వెళ్లి 'ఈ పెళ్లి ఆపండి, యువతితో నేను పదేళ్లుగా ప్రేమలో ఉన్నా' అన్నాడు. అంతటితో ఆగకుండా అక్కడే ఉన్న సారె పళ్లాన్ని కాలితో తన్నాడు. ఈ దృశ్యాన్ని చూసిన ప్రతి ఒక్కరూ షాక్‌కు గురయ్యారు. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరుకు చెందిన ఓ యువతి తన పెద్దమ్మ ఇంటికి తరచూ వెళ్లేది. 2022లో అక్కడ నందవర్ధన్ అనే యువకుడితో పరిచయం ఏర్పడింది. ఈ విషయం యువతి తల్లిదండ్రులకు తెలిసింది. ఆ యువకుడు మంచివాడు కాదు, మాట్లాడొద్దని కుటుంబ సభ్యులు హెచ్చరించడంతో ఆమె మాట్లాడటం మానేసింది. అయితే నందవర్ధన్ మారలేదు. మాట్లాడకపోతే తన వద్ద ఉన్న ఫొటోలు అందరికీ చూపిస్తానని బెదిరించడం ప్రారంభించాడు. యువతి కుటుంబం సంబంధాలు చూస్తుండగా, వాటిని కూడా చెడగొట్టేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో యువతి కుటుంబ సభ్యులు సైతం నందవర్ధన్ కుటుంబంతో మాట్లాడి ఒకరి జోలికి ఒకరు వెళ్లకూడదని అంగీకారం చెప్పుకొన్నారు. కొన్నిరోజుల తర్వాత తిరిగి నందవర్ధన్ మాత్రం యువతి వెనుకపడటం ప్రారంభించాడు. ఫొటోలను అందరికీ చూపిస్తానని బెదిరించాడు. దీంతో యువతి కుటుంబ సభ్యులు నవాబుపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నందవర్ధన్‌ను పోలీసులు స్టేషన్‌కు పిలిపించి మందలించారు.

పోలీసులకు ఫిర్యాదు

యువతికి సంబంధం చూసి వివాహం చేసేందుకు పెద్దలు నిర్ణయించారు. ఈ క్రమంలో ఈ నెల 22వ తేదీన అయ్యప్ప గుడి సెంటర్‌లోని రాధాకృష్ణ కల్యాణ మండపంలో బంధువుల సమక్షంలో నలుగు కార్యక్రమం జరిగింది. అక్కడికి పెళ్లికొడుకు కూడా వచ్చాడు. ఈ విషయం తెలుసుకున్న నందవర్ధన్ తన స్నేహితులు కుమార్, తులసీతో కలిసి వెళ్లి యువతిని కాలితో కొట్టే క్రమంలో సారె పళ్లాన్ని తన్నాడు. కొంతసేపు ఉద్రిక్తత వాతావరణం చోటు చేసుకోవడంతో అక్కడున్న వారంతా భయపడ్డారు. దీంతో యువతి కుటుంబ సభ్యులు వేదాయపాళెం పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. వారు గురువారం కేసు నమోదు చేశారు.

వ్యక్తి బలవన్మరణం

విడవలూరు: ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని బుసగాడిపాళెం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని బుసగాడిపాళెం గ్రామానికి చెందిన ఇండ్ల శామ్యూల్ (22)కు భార్య చెంచులక్ష్మి, ఇద్దరు పిల్లలున్నారు. బుధవారం అతను ఇంట్లో ఉండగా తల్లి ఇంటి పనులు పూర్తిచేయించాలని మందలించింది. దీంతో మనస్తాపం చెంది పొలాల్లో చల్లే గుళికల మందు తిని ఇంట్లో ఉండగా గమనించిన కుటుంబ సభ్యులు ఆయన్ను నెల్లూరు ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతిచెందాడు. ఈ ఘటనపై ఆయన భార్య స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘాల ఏర్పాటు



సీఈఓకు సర్టిఫికెట్ అందజేస్తున్న డీసీఓ గురప్ప

- డీసీఓ గురప్ప

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని డీసీసీ బ్యాంక్ పరిధిలో 19 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ద్వారా రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేస్తున్నట్లు డీసీఓ గురప్ప తెలిపారు. నెల్లూరులోని కృషి విజ్ఞాన కేంద్రంలో గురువారం పీఏసీఎస్ సంఘాల సీఈఓలకు రైతు ఉత్పత్తిదారుల సంఘాల ఏర్పాటు, నిర్వహణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ సాంకేతికత, పరపతి, ఇన్‌పుట్, రైతులు పండించిన పంటలకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు దేశ వ్యాప్తంగా 10 వేల సంఘాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. వ్యవసాయ శాఖ, పశుసంవర్ధక శాఖ, ఉద్యాన శాఖల సహకారంతో రైతులకు డ్రోన్‌లు, విత్తన ఉత్పత్తి, పాలిహౌస్, గ్రీన్‌హౌస్ శక్తిటిల్లర్, స్ప్రేయర్లు లాంటి పరికరాలు అందించడం జరుగుతుందన్నారు. అనంతరం సీఈఓలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఆప్కాబ్ ఏజీఎం ప్రదీప్‌రెడ్డి, డీసీసీబీ జీఎం సరిత, కృషి విజ్ఞాన కేంద్ర సమన్వయకర్త డా.శివజ్యోతి, మనీషా, గురూజీ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన లారీ



ఘటనా స్థలంలో ట్రాక్టర్

వెంకటాచలం: మండల కేంద్రమైన వెంకటాచలంలో జాతీయ రహదారిపై పొట్టు లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తాపడింది. ఈ ఘటన గురువారం ఉదయం జరిగింది. నెల్లూరు వైపు నుంచి గూడూరు వైపు వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో అదుపుతప్పి బోల్తా పడింది. పొట్టు జాతీయ రహదారిపై పడడంతో ట్రాఫిక్ స్తంభించింది. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో బోల్తా


- ముగ్గురికి గాయాలు



ఘటనా స్థలంలో ఆటో, కూలీలు

సైదాపురం: మండలంలోని కలిచేడు గ్రామ సమీపంలో గురువారం ఆటో బోల్తా పడి ముగ్గురు గని కార్మికులు గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని అనంతమడుగు గ్రామానికి చెందిన రామయ్య తన ఆటోలో పలువురు కార్మికులను ఎక్కించుకుని పొదలకూరు కొనగలూరు గ్రామంలో ఉన్న గని వద్దకు తీసుకెళ్తుంటాడు. తిరిగి ఇంటికి చేరుస్తుంటాడు. గురువారం ఉదయం 15 మంది కార్మికులతో అనంతమడుగు నుంచి కొనగలూరుకు బయలుదేరాడు. కలిచేడు సమీపంలోని మసీదు దగ్గర ఉన్న కల్వర్టు వద్ద ఆటో బోల్తా పడింది. దీంతో బుల్లెమ్మ, రమణయ్య, వెంకటేశ్వర్లు గాయపడ్డారు. వారిని పొదలకూరు ఆస్పత్రికి తరలించారు. మిగిలిన వారికి గాయాలు కాలేదు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థినికి రాష్ట్ర స్థాయి ర్యాంకు



నాగరాణి

ఉదయగిరి రూరల్: రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో ప్రవేశం పొందేందుకు నిర్వహించిన ఏపీ పీజీ సెట్ 2025లో పట్టణంలోని మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని బి.నాగరాణి కళాశాల టాపర్‌గానే కాక ఫిజిక్స్ సబ్జెక్ట్‌లో రాష్ట్ర స్థాయిలో మూడవ ర్యాంక్ సాధించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ ఎల్.నారాయణస్వామి తెలిపారు. గురువారం ప్రిన్సిపల్‌తోపాటు వైస్ ప్రిన్సిపల్ ఎ.నరసింహులు, ఐక్యూ ఏసీ కో- ఆర్డినేటర్ విక్రమ్, అధ్యాపకులు వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావులు విద్యార్థినిని అభినందనలు తెలిపారు.